క్లుప్తంగా

పైపులైన్‌కు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్..

మరిపెడ రూరల్: మండలంలోని వీరారం శివారు వడ్డెర కాలనీ సమీపంలో విస్సంపల్లి గ్రామానికి సరఫరా అయ్యే మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ లీకేజీ అయింది. దీనిపై 'లీకేజీతో తాగునీరు కలుషితం' అనే కథనం 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన మిషన్ భగీరథ డీఈ స్వామిదాస్ సంఘటన వద్దకు చేరుకుని పైపులైన్ మరమ్మత్తులు చేపట్టారు. ఆయా గ్రామాల ప్రజలకు సురక్షిత తాగునీరు సరఫరా చేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ సూపర్‌వైజర్, సిబ్బంది గాజుల మనోహర్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



కురవి: మండల కేంద్రంలోని పెద్ద చెరువు కట్ట వద్ద ముదిరాజ్ కులస్తుల ఆరాధ్యదైవం పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముదిరాజ్ సొసైటీ అధ్యక్షుడు కొణతం చిన్న సత్యం–నాగమణి పూజలో పాల్గొని మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల కుల దైవం పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణం చేపట్టేందుకు కులబాంధవులు ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ కొణతం పెద్ద సత్యం, కార్యదర్శి లక్క అశోక్, డైరెక్టర్లు మామిడి యాకన్న, రేషబోయిన నారాయణ, కుల పెద్దలు గువ్వ వెంకన్న, కొణతం విజయ్, నీలం సత్యం, కొణతం పెంటయ్య, ఎంపీటీసీ చిన్నం భాస్కర్, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బోనాల సమర్పణ



మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి గ్రామంలో దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన పూజల్లో భాగంగా అభయాంజనేయస్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బొడ్రాయి, మారెమ్మ తల్లికి బోనాల సమర్పణ, పూజలు కనుల పండువగా నిర్వహించారు.

మిషన్ భగీరథ తాగునీటి పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

గార్ల: మండలంలోని అంజనాపురం గ్రామం గుడిసెంటర్ బజారులో అధికారులు ఎట్టకేలకు మిషన్ భగీరథ తాగునీటిని కుళాయిల ద్వారా ఆదివారం ప్రజలకు సరఫరా చేశారు. గుడిసెంటర్‌లో మిషన్ భగీరథ తాగునీరు గత 25 రోజులుగా రావడం లేదని గ్రామస్తులు శనివారం ఖాళీ బిందెలతో ఆందోళన చేయడంతో 'సాక్షి' దిన పత్రికలో 'తాగునీటి ఎద్దడిని నివారించాలి' అనే శీర్షికన ఆదివారం ప్రచురితమైన కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వసుంధర స్పందించారు.

ధాన్యం బస్తాల చోరీపై ఫిర్యాదు



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ బ్రిజ్ గోపాల్ ఝువర్‌కు సంబంధించిన 29 బస్తాల ధాన్యం చోరీ చేశారు. చోరీకి బాధ్యులైన వారిపై జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన ఏఎంసీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. రోజు మాదిరిగానే బ్రిజ్ గోపాల్ ఝువర్ శనివారం మార్కెట్‌లో రైతుల నుంచి ధాన్యం ఖరీదు చేసి కాంటాలు పెట్టిన కొంత సమయానికి 29 ధాన్యం బస్తాలు తక్కువగా ఉన్నాయి. మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయటం లేదన్నారు. జిల్లా మార్కెటింగ్ అధికారి, టౌన్ పోలీసు స్టేషన్, వరంగల్ జేడీఎంకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

బెల్ట్‌షాపుపై దాడులు

గార్ల: మండలంలోని బంగ్లాతండాకు చెందిన ఉప్పు మల్లేశ్వరరావు తన కిరాణ షాపులో మద్యం అమ్ముతుండగా ఆదివారం దాడి చేసి రూ.2,775 విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీనత్‌కుమార్ తెలిపారు.

నిరుపయోగంగా ఓవర్‌హెడ్ ట్యాంకు

- ఎస్సీ కాలనీలో పని చేయని బోర్
- బావితో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



శిథిలావస్థకు చేరుకున్న ఓవర్‌హెడ్ ట్యాంకు



ఊరికి ఉపయోగపడుతున్న బావి

కురవి: మండలంలోని కందికొండ గ్రామంలో ప్రజలకు తాగునీటిని అందించేందుకు నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుని ఉపయోగంలో లేకుండాపోయింది. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితిలో ఓవర్‌హెడ్ ట్యాంకు ఉంది. కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న ట్యాంకును మంచినీటిని సరఫరా చేసేందుకు ఉపయోగించడం లేదు. ప్రస్తుతం గ్రామంలో మంచినీటి సరఫరా అందచేసేందుకు మిషన్ భగీరథ పథకం ఉపయోగపడుతోంది. భగీరథ నీటిని డైరెక్ట్ పంపింగ్ ద్వారా గ్రామంలో నీటిని సరఫరా చేస్తున్నారు. కొన్ని కాలనీలకు మంచినీటి బావి నుంచి నీటిని సరఫరా చేసేందుకు పంచాయతీ అధికారులు ఏర్పాట్లు చేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ ప్రజలకు మంచినీటిని అందిస్తున్న చేతి పంపు ప్రస్తుతం పని చేయడం లేదు. దీనికి మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి ఉంది. నిధులు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బోర్లకు మరమ్మతులు చేయాలి



తక్షణమే గ్రామంలో ఉన్న బోర్లకు మరమ్మతులు చేయించాలి. వాటికి విద్యుత్ మోటార్లు బిగించి వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి. ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం చేపట్టాలి. మంచి నీటికి ఇబ్బందులు లేకుండా చేయాలి.

– బొడ్డు రమేష్, కందికొండ

పంపింగ్ ద్వారా నీటిని అందిస్తున్నాం..

గ్రామంలో మిషన్ భగీరథ నీటిని డైరెక్ట్ పంపింగ్ ద్వారా మంచినీటిని అందిస్తున్నాం. డైరెక్ట్ పంపింగ్ ద్వారా ప్రెషర్ తక్కువగా ఉండడంతో కొన్ని కాలనీలకు మంచినీటి బావిని ఉపయోగిస్తున్నాం. ఎస్సీ కాలనీలో ఉన్న బోర్ మరమ్మతుకు నిధుల అవసరం ఉంది. గ్రామంలో కొత్త ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించాల్సి ఉంది.

– అజయ్, పంచాయతీ కార్యదర్శి, కందికొండ

ఎన్ని కుట్రలు చేసిన గెలుపును ఆపలేరు

- ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్



మహబూబాబాద్ అర్బన్: మార్కెట్‌లో రైతులతో మాట్లాడుతున్న సీతారాంనాయక్

మహబూబాబాద్ అర్బన్: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఎన్ని కుట్రలు చేసిన బీజేపీ గెలుపును ఎవరు ఆపలేరని, మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమని బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదివారం మార్నింగ్ వాకింగ్‌లో సీతారాం నాయక్ పలుసెంటర్లను, కూరగాయ మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు ఒక్కసారి అవకాశం ఇస్తేనే జిల్లాకు గిరిజన పాఠశాలలు, ఏకలవ్య ఇంటర్, డిగ్రీ గురుకులాలు, గిరిజన యూనివర్సిటీని తీసుకువచ్చాన్నారు. మళ్లీ మరోసారి ఎంపీగా గెలిపిస్తే గిరిజన జిల్లా అయిన మానుకోటను మరింత అభివృద్ధితోపాటు, అనేక పరిశ్రమలు, బయ్యారం ఉక్కు పరిశ్రమ, రైతులకు కావాల్సి ఏరువుల, కూరగాయల ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో వద్దిరాజు రామచందర్ రావు, నాయకులు, మోసంగి మురళీ, శ్యామ్‌సుందర్‌శర్మ, యాప సీతయ్య, సింగరపు సతీష్ పాల్గొన్నారు.

సీతారాంనాయక్‌ను గెలిపించాలి

కేసముద్రం: మోదీని మరోసారి ప్రధాన మంత్రిని చేయాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గాంతి వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం కేసముద్రం విలేజిలో బీజేపీ నాయకులు ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్లు ఉప్పునూతల రమేష్, ఐలయ్య, ఆకుతోట శివ, మంగిశెట్టి నాగయ్య పాల్గొన్నారు.

నెల్లికుదురు: మండలంలోని తారాసింగ్ బావితండాలో ఆదివారం బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాం నాయక్ కుమారుడు డాక్టర్ అజ్మీర రాకేష్ స్థానిక నాయకులతో కలసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు యుగేందర్, అనిల్, మనోజ్, నవీన్ పాల్గొన్నారు.

ఎంతో మందిని నాయకులుగా తీర్చిదిద్దా..



మాట్లాడుతున్న రెడ్యానాయక్

డోర్నకల్: తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎంతో మంది అనామకులను రాజకీయ నాయకులుగా, ప్రజాప్రతినిధులుగా తీర్చిదిద్ది అందలమెక్కించానని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పేర్కొన్నారు. మండలంలోని అమ్మపాలెం, తహసీల్‌దారు బంజర గ్రామాలతోపాటు డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డుల్లో ఆదివారం రెడ్యానాయక్ పర్యటించి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మహబూబాబాద్ పార్లమెంటు బీఆర్‌ఎస్ అభ్యర్థి మలోత్ కవితను గెలిపించాలని కోరారు. రాజకీయంగా తనను విడిచి వెళ్లినవారు రాజకీయ భవిష్యత్ కోల్పోయారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నున్నా రమణ, పట్టణ అధ్యక్షుడు కత్తెరసాల విద్యాసాగర్, ఎంపీపీ బాలునాయక్, కౌన్సిలర్లు హేమచంద్రశేఖర్, సంధ్యారాణిరమేష్, అంకెపాక అరుణ, బోరగల్ల శరత్, కొత్త రాధికావీరన్న, పోటు జనార్దన్, కాలా మోనికాయశోధర్ పాల్గొన్నారు.

ఎన్నికల సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న విజయసారథిరెడ్డి

నెహ్రూసెంటర్: ఇండియా కూటమి మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపును కాంక్షిస్తూ మే 3వ తేదీన జిల్లా కేంద్రంలో జరగనున్న సీపీఐ ఎన్నికల సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథిరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా సమితి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీజేపీ, బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు విసిగిపోయారని అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన తీర్పునే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చి ఇండియా కూటమిని గెలిపించాలన్నారు. దేశాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పి సంపదను లూటీ చేస్తున్న బీజేపీ మోడీ ప్రభుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు. కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా గ్రామాలు, మండలాల్లో జెండాలను ఎగురవేసి ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బి.అజయ్‌సారథిరెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, నాయకులు పాండురంగాచారి, చింతకుంట్ల వెంకన్న, పెరుగు కుమార్, సాంబలక్ష్మీ, వరిపెల్లి వెంకన్న, నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలి



నెహ్రూనాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

డోర్నకల్: ఆపదలో ఉన్నవారికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉండాలని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు మాళోత్ నెహ్రూనాయక్ కోరారు. స్థానిక యాదవనగర్‌లో ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందిన కాంగ్రెస్ కార్యకర్త కోడూరు నరేష్‌ను ఆదివారం నెహ్రూనాయక్ పరామర్శించి ఆర్థికసాయం అందించారు. ఈసందర్భంగా నెహ్రూనాయక్ మాట్లాడుతూ.. నరేష్ చికిత్స కోసం కాంగ్రెస్ నాయకులు ఎల్లావుల హరికృష్ణ స్పందించి వాట్సాప్ గ్రూపు ద్వారా దాతలు, స్నేహితుల ద్వారా చికిత్స కోసం ఆర్థికసాయం అందేలా కృషి చేయడం అభినందనీయమన్నారు. అనంతరం నెహ్రూనాయక్‌ను స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కోటిలింగం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుమీర్‌చంద్‌జైన్, నాయకులు శీలం శ్రీనివాస్, భూక్యా తారాచంద్, ఎర్ర శ్రీను, మాదా శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

నెహ్రూసెంటర్: మాతృత్వం ఓ వరమని, సంతానలేమితో దంపతులు బాధపడాల్సిన అవసరం లేదని ఓయాసిస్ ఫర్టిలిటీ డాక్టర్ జలగం కావ్యారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర నర్సింగ్ హోంలో సంతాన సాఫల్య చికిత్సపై ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ కావ్యారావు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న అత్యాధునిక, వివిధ రకాల చికిత్సలను తీసుకోవడం ద్వారా సంతానలేమి సమస్య నుంచి విముక్తి పొందుతారన్నారు. ఈఅవకాశాన్ని దంపతులు వినియోగించుకుని సంతానలేమి సమస్య నుంచి బయటపడాలన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ నెహ్రూ, అర్జున్‌రెడ్డి, డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

అబద్ధపు హామీలతో కాంగ్రెస్ గెలుపు



గూడూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

గూడూరు: ఎన్నికల్లో గెలవడానికి కాంగ్రెస్ అబద్ధపు హామీలు ఇచ్చిందని, పార్టీని గెలిపించినందుకు ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం మండల అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి అధ్యక్షతన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక మండల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ పథకాలను కాపీ కొట్టిన కాంగ్రెస్ ఇప్పటి వరకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. ఓటేసి ప్రజలు కాంగ్రెస్‌ను గద్దెనెక్కిస్తే, వాయిదాల పద్ధతిలో వాగ్దానాలను వాయిదా వేస్తున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవితను గెలిపించాలని వారు కోరారు. కొంత మంది బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు స్వార్థం కోసం పార్టీ ఫిరాయిస్తున్నారని, అలాంటి వాళ్లు పోయినా పర్వాలేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, మర్రి రంగారావు, కుడితి మహేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, నూకల సురేందర్‌యాదవ్, బోడ కిషన్‌నాయక్, నర్సింహనాయక్, కఠార్‌సింగ్, సంపత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కవితను గెలిపించాలి

కురవి: బీఆర్‌ఎస్ అభ్యర్థి మాలోత్ కవితను గెలిపించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోటలాలయ్య పిలుపునిచ్చారు. ఆదివారం సీరోలు మండలం కొర్లకుంట తండాలో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు తేజావత్ భోజ్యానాయక్, పిచ్చిరెడ్డి, రవినాయక్, రాజు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఈ నరేష్

కురవి: విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మహబూబాబాద్ విద్యుత్ శాఖ ఎస్‌ఈ జె.నరేష్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యుత్ ప్రమాద నివారణపై సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మార్త సంతోష్, వైస్ ప్రిన్సిపాల్ వై.శోభారాణి, ఎస్‌ఏఓ సంతోష్, డీఈలు శ్రీకాంత్, విజయ్, ఏడీఈ రమేష్, ఏఈ శారద, ఎస్‌ఈ రఫీయుద్దీన్, ఎస్‌ఎల్‌ఐ కేదారి, లైన్ ఇన్‌స్పెక్టర్ జంపీరావు, జేఎల్‌ఎం సిద్ధూ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నీటి సరాఫరా బంద్

మహబూబాబాద్ అర్బన్/మరిపెడ రూరల్: మరిపెడ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పరిధిలో సమస్య ఉండటంతో నేడు సోమవారం మంచినీటి సరాఫరా నిలిచిపోతుందని జిల్లా మిషన్ భగీరథ గ్రిడ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ సురేందర్ ఆదివారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలోని అన్ని గ్రామలతో పాటు వరంగల్ జిల్లా పరిధిలోని రాయపర్తి, నర్సంపేట డివిజన్‌లో అన్ని గ్రామలు, ఆవాసాలకు సోమవారం రోజున మంచినీటి సరాఫరా నిలిచిపోతుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కమిషనర్లు, జిల్లాలోని అన్ని గ్రామ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు నీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఘన నివాళి

మహబూబాబాద్ రూరల్: బీఆర్‌ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు డోలి లింగబాబు, నలంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డోలి సత్యనారాయణ మాతృమూర్తి డోలి ఎల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథి రెడ్డి ఆదివారం ఎల్లమ్మ మృతదేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మహబూబాబాద్: లాల్ బహదూర్ హైస్కూల్‌లో..



బయ్యారంలో..



కేసముద్రంలో..



నర్సింహులపేట: సమ్మేళనంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని లాల్ బహదూర్ హైస్కూల్‌లో 1996 నుంచి 2006వరకు విద్యనభ్యసించిన విద్యార్థులు పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. గురువులు విజయలక్ష్మి, సరోజన, రహీం, సంగీత, రమణ, మురళీకృష్ణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గోపి, ఓం ప్రకాష్, వంశీ, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం: బయ్యారంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1995–96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు వెంకట్‌రెడ్డి, దేవేంద్రాచారి, శ్రీధర్, ఆర్వీ ప్రసాదరావులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమేష్, రాజా, మధు, శ్రీనివాస్, రాందాస్, సరిత, తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రం: మండల కేంద్రంలోని గీతాంజలి హైస్కూల్‌లో 1999–2000 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. ఈసందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, దన్నసరి సొసైటీ డైరెక్టర్ కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, కొండ్రెడ్డి యాకూబ్‌రెడ్డి, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, సతీష్, బూర స్వప్న, జ్యోత్స్న, శ్రీలత, కవిత, రాజు, రమేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నర్సింహులపేట: మండల కేంద్రంలోని హైస్కూల్‌లో 1984–85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం నర్సింహులపేటలోని తిరుపతమ్మ తల్లి ఆలయ సన్నిధిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అనాటి ఉపాధ్యాయులు స్వామి, దక్షిణమూర్తిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజు, రుద్ర, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రంగారెడ్డి, మల్లారెడ్డి, మాధవరావు, ఉదయపాల్, శ్రీనివాసమూర్తి, నరహరి, యామిని, లత, కల్యాణి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

జోరుగా ఇసుక అక్రమ రవాణా



చిన్నగూడూరు: మండలంలోని ఆకేరు వాగు సమీపంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. మండలంలోని విస్సంపల్లి, మన్నెగూడెం, గుండంరాజుపల్లి గ్రామాల నుంచి మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా కూడా అక్రమ ఇసుక రవాణాకు అడ్డు అదుపు లేకుండా పోతుందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ట్రాక్టర్లకు ఎలాంటి నంబర్ ప్లేట్ లేకుండా యథేచ్ఛగా ఇసుక రవాణా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. చర్యలు తీసుకోవాల్సిన అధికారులే చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

చిన్నగూడూరు: మండలంలోని ఉగ్గంపల్లిలో డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ సమక్షంలో దంతాలపల్లి మండలం దాట్ల గ్రామానికి చెందిన బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు కొండ బుచ్చయ్య, నాయకులు వెంకన్న బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే రెడ్యా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు ధర్మారపు వేణు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

జైన మందిరం నిర్మాణానికి భూమిపూజ



గార్ల: గార్లలో నూతన శాంతినాథ్ దిగంబర్ జైన మందిరం నిర్మాణానికి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ జైనులు ఆదివారం భూమిపూజ చేశారు. గత 70 ఏళ్ల క్రితం నిర్మించిన జైన మందిరం శిథిలావస్థకు చేరుకోవడంతో, ఇదే స్థానంలో నూతనంగా జైన మందిరం నిర్మాణం చేపడుతున్నారు. కార్యక్రమంలో జైనులు రూప్‌చంద్ మహవీర్, కాలా వినోద్, విజయ్, ప్రవీణ్, పదమ్, మహవీర్, గోపాల్ పాల్గొన్నారు.

వార్షికోత్సవం

మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఆనెపురం గ్రామ శివారు నాగేంద్రస్వామి ఆలయ 23వ వార్షికోత్సవం వేడుకలను ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. ప్రతి ఏడాది చైత్ర మాసం బహుళ పంచమి రోజు ఆలయ శాశ్వత చైర్మన్ గుగులోతు అమనాయక్, ఆలయ భక్త మండలి సభ్యుల ఆధ్వర్యంలో వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

ఖానాపురం: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే పంట ఉత్పత్తులకు మద్దతు ధర లభిస్తుందని పద్మావతి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఇన్‌చార్జ్‌లు చెడుపాక ఉపేందర్, గిరగాని నర్సయ్య తెలిపారు. మండలంలోని బుధరావుపేటలో సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం వారు ప్రారంభించి మాట్లాడారు. యాసంగిలో రైతుల కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రంలోనే ధాన్యాన్ని విక్రయించి సరైన ధర పొందాలని సూచించారు. దళారులను ఆశ్రయిస్తే నష్టపోయే అవకాశం ఉందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్, రాజయ్య, కృష్ణారెడ్డి, వీరేశ్, శ్రీను, వెంకటప్రసాదరావు, యాకుబ్‌పాషా, వెంకన్న, రవీందర్‌రెడ్డి, రాంనర్సింహారెడ్డి, వెంకన్న, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

హరితహారం చెట్లు అగ్నికి ఆహుతి



మరిపెడ రూరల్: మరిపెడ మండలం స్టేజితండా గ్రామ పంచాయతీ పరిధిలోని కుడియాతండా సమీపంలోని ఖమ్మం–వరంగల్ హైవే రోడ్డుకు హరితహారం చెట్లు శనివారం అగ్నికి ఆహుతి అయ్యాయి. హరితహారంలో భాగంగా హైవేకు ఇరువైపుల నాటిన మొక్కలు పెరిగి పెద్దయ్యాయి. చెట్లుగా ఎదిగి వాహనదారులకు నీడతోపాటు ఆహ్లాదరకరమైన వాతావరణాన్ని పంచుతున్నాయి. ఈక్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు చెట్ల మధ్య కారాకులకు అగ్గి పెట్టడంతో మంటలు వ్యాపించి పదుల సంఖ్యలో చెట్లు కాలిపోయాయి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.